"ఆ పిల్లవా డెవరోయి?" అన్నాడు కొమప్ప సోమయాజులు.

ముందుకీ వెనక్కీ కంపించిపోయాడు చిదంబరశాస్త్రి. "వీడా? మా అమ్మమ్మ తమ్ముడి కొడుకు, కాశీలో వున్నాడులే, వాడి కొడుకు. కోడలూ, నేనూ ఆరునెలలపాటు వాళ్ళింట్లోనే ఉన్నాము, కాశీలో ఉన్నప్పుడు. వీడు దానికి అలవా టయినాడు. కోడలు వీడి మీద మోజు పడింది. వాళ్లు కూడా అయినవాళ్లు. అందుచేత విశ్వేశ్వరుడిపురంలో ఆ కాస్త దత్త స్వీకారం అనిపించేను దానిచేత."

"అరి, ఎంతవాడివోయ్! అయిందీ!"

"ఏం చెయ్యను మామా? కోడలు ఒకటే పట్టు పట్టింది. నాకు తప్పింది కాదు."

"జుట్టు తీయించాశావు కాదేమీ?"

"తీరా తిరపతికి వెళ్ళేటప్పటికి దానికి జ్వరం తగిలింది. ఆ వూరు వొదిలిందాకా జ్వరం తీసింది కాదు. అచ్చిరాలేదని మానేశాను."

"వీడూ—అచ్చంగా కోడలులాగే వున్నాడు?"

"వాడి తల్లి సరిగ్గా కోడలులాగే ఉంటుంది. తల్లి పోలిక వీడు."

"ఊహుం........"

ఊళ్లోవా రంతా దత్తపుత్రుడిమీద రాజమ్మకి అమితప్రేమ అని అనుకొనేవారు.

"ఈ రత్నం నా భాగ్య"మనుకొనేది రాజమ్మ.

"నా పాప ఫలము వీడు" అనుకొనేవాడు చిదంబరశాస్త్రి.

---

# 10. సంక్రాంతి సంచిక

"ఏం కావా లమ్మా, అమ్మాయీ?" అని అడిగాడు న్యూస్ ఏజెంటు రామారావు.

"పత్రిక" అంటూ తన చిన్ని చేతులలోవున్న అణా కాసును తర్జని, అంగుష్ఠములతో పట్టుకొని, అతనికి అందిస్తూ తన చెయ్యి ముందుకు చాచింది, ఆ బాలిక. జాలిగొలిపే కళ్ళు, ముద్దువచ్చే పెదవులు, చక్కని రత్నంలా వుంది ఆ తొమ్మిదేళ్ల అమ్మాయి.

ఆ అమ్మాయివైపు చూస్తూ, ఆ అణా కాసు తీసుకొని తన ప్రక్కనేవున్న పత్రికలలోనుంచి ఒకటి తీసి యిచ్చాడు. ఆ పత్రిక తీసుకొని ఆ బాలిక వెళ్ళబోతూంటే, మనసు పట్టలేక "ఎవరమ్మాయివమ్మా, నువ్వు?" అని అడిగాడు. "వెంకట రామయ్యగారి అమ్మాయినండి" అని జవాబు చెప్పింది.

"మీ నాన్నగారికి ఏం పని?" అన్నాడు.

"ఏం పనీ లేదండి" అంది.

"ఏం చేస్తున్నారు?" అని మళ్ళీ అడిగాడు.

"ఏం చెయ్యడంలేదు" అని జవాబు చెప్పింది.

బ్రదుకుదెరువుకి ఎవ రేపనిచేస్తారో, అసలు ఏదో ఒకపని చెయ్యాలో, లేక తండ్రి తాతలు సంపాదించి పెట్టిన ఆస్తినయినా చూసుకోవాలో—యీ గొడవలన్నీ తెలియని ఆ అమాయికపు బొమ్మ తన సహజమైన ధోరణిలో చెప్పిన న్యాయమైన జవాబులు, ఆ న్యూస్ యేజెంటును నిరుత్తరుణ్ణి చేశాయి. ఇక ఏమీ మాట్లాడలేకపోయాడు. ఇంకా ఏమైనా ప్రశ్నలు అడుగుతాడేమోనవి ఒకటి రెండు నిమిషాలు అక్కడ నిలబడి, ఆతడేమీ మాట్లాడకపోవడం చూసి, "నే వెళతానండి" అని ఆ అమ్మాయి వెళ్ళిపోయింది. ఇది మొదటిరోజు సంగతి.

తరువాత ఆ అమ్మాయి, రోజూ సరిగా అదేవేళకు వచ్చి, అణా ఇచ్చి ఒక పేపరు కొనుక్కొని వెళుతూ వుండేది. ఒక్కొక్కనాడు, ఆ అమ్మాయి వచ్చేవేళకు అతడు ఎవరైనా స్నేహితులతో కూచుని కాఫీ తీసుకుంటూ వున్నట్లయితే, ఆ అమ్మాయికికూడా కొంచెం యిచ్చేవాడు. మొదట్లో ఒకటి రెండుసార్లు ఆ అమ్మాయి సిగ్గుపడింది; కాని, క్రమేణా అతని బలవంతంవల్ల అతడిచ్చిన కాఫీ తీసుకుంటూ వుండేది. అతడి న్యూస్‌ఏజన్సీవ్యాపారంలో ఆ అమ్మాయి ఒక భాగమైపోయింది. కాని, అంత నిర్దాక్షిణ్యంగా చెప్పవలసిన వ్యాపార భాగమే కాకుండా, అతని

జీవితంలోనే ఒక స్థానాన్ని ఆ అమ్మాయి సంపాదించుకున్నది.

ఆ నాడు సంక్రాంతి.

సంక్రాంతి ప్రత్యేక సంచికలు వచ్చాయి. అన్నీ అమ్ముడు అయి పోయాయి. ఆ అమ్మాయికోసం మాత్రం ఒక్క సంచికను అతడు జాగ్రత్త పెట్టాడు.

మామూలు వేళ అయింది. ఆ అమ్మాయి రాలేదు.

మరి కొంతకాలం గడిచింది. ఆ అమ్మాయి రాలేదు.

ఎంతోమంది వచ్చి "సంక్రాంతి సంచిక వుందా?" అని అడుగుతున్నారు. "అయిపోయాయి" అని చెపుతున్నాడు. ఆ అమ్మాయి రాలేదు.

మధ్యాహ్నం భోజనం వేళ అయింది. ఆ అమ్మాయి రాలేదు.

అతడి భోజనం అయింది. కొంతసేపు నిద్రతీశాడు. ఆ అమ్మాయి రాలేదు.

పండగకదా, ఆ సందడిలో ఉంటుంది, రేపు వస్తుంది, అప్పుడు సంక్రాంతి సంచిక తీసుకుంటుంది అనుకున్నాడు. పండగ వెళ్ళిపోయింది.

మర్నాడు పత్రికలే లేవు. చెన్నపట్నంలో పండుగనాడు పత్రికలకు సెలవు అయితే పొరుగూళ్ళలో మర్నాడు సెలవు.

కాని, ఆనాడుకూడా అతడు ఆ అమ్మాయికోసం ఎదురుచూశాడు. ఆ అమ్మాయి రాలేదు.

మళ్ళీ మర్నాడు పత్రికలు వచ్చాయి. ఆ అమ్మాయి రాలేదు అతనికి ఏమీ తోచలేదు. సంక్రాంతి సంచిక అలాగే వుంది.

మధ్యాహ్నం భోజనాల వేళదాకా చూశాడు. ఆ అమ్మాయి రాలేదు. అతనికి కడుపులో యేదో మంట ఆరంభమైంది. ఇక ఆగలేకపోయాడు.

సంక్రాంతి సంచిక చేతపట్టుకొని, వెంకట్రామయ్యగారి ఇంటికి బయలుదేరాడు.

వారి యింటి తలుపులు వేసివున్నాయి. "వెంకట్రామయ్యగారూ!" అని పేరుపెట్టి పిలిచాడు.

నలభై యేళ్ళ పురుషుడు తలుపు తెరచి "ఏమండీ?" అని చాలా దీనంగా అడిగాడు.

"వెంకట్రామయ్యగారు మీరేనా?"

"అవునండి."

"రెండు రోజులనుంచి మీ అమ్మాయి పత్రికకోసం రావడం లేదండి."

వెంకట్రామయ్య రెండు చేతులతోటి మొహం కప్పుకొని, "ఇంక రాదండి" అనేశాడు.

న్యూస్ ఏజెంటుకు గుండె గతుక్కుమన్నది.

"ఏం?" అన్నాడు నిర్ఘాంతపడి.

"దేవుడు తీసుకుపోయాడు" అనేశాడు, ఆ అమ్మాయి తండ్రి.

"అయ్యో!" అని నిలువునా నీరైపోయాడు న్యూస్ ఏజెంటు. అతని కళ్లముందు ఏమేమి దృశ్యాలు తిరిగాయో, కన్నీటి చుక్కలు నేలరాలాయి.

"అయ్యో!" అనుకుంటూ, వచ్చినదారినే ఇంటికి చేరాడు.

ఆనాటికీ, ఈనాటికీ ఆ సంక్రాంతి సంచిక అలాగే వుంది. దానిని చూసినప్పుడల్లా న్యూస్ యేజెంటు మొహం బిక్కపోతూ వుంటుంది.

---

# 11. ఇంటి అద్దె

శేఖరరావు కథలు వ్రాస్తాడు. మదరాసుకు రాకపూర్వం అతని కథలు కొన్ని పత్రికలలో అచ్చు పడ్డాయి. ఒకరిద్దరు సంపాదకులు అతని కథలను మెచ్చుకుంటూ ఉత్తరాలు వ్రాశారు కూడాను. అంచేత అతను ఉద్యోగ ప్రయత్నాలు విరమించి, కథలు వ్రాసుకొని జీవిద్దామనీ, అవ